
సాక్షి
మెదక్
శుక్రవారం। 3। జనవరి। 2025




హిమం.. మురిపెం

పల్లెటూరు.. చుట్టూ పంట పొలాలు.. మంచు దుప్పట్లను తొలగించుకుంటూ తొంగిచూసే సూర్యుడు.. వింటేనే మనసుకు ఎంతో ఆహ్లాదంగా ఉంది కదా.. ఇక నిజంగా ఆస్వాదిస్తే ఎంత బాగుంటుందో.. గత కొన్ని రోజులుగా చలి తీవ్రత పెరగడంతో గ్రామాల్లో మంచు సోయగాలు ఇలా ఆకట్టుకుంటున్నాయి. గురువారం కొల్చారం మండలంలోని దుంపలకుంట సమీపంలో పొగ మంచు దృశ్యాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– కొల్చారం(నర్సాపూర్)

న్యూస్‌రీల్

సీఎంకు షెట్కార్ శుభాకాంక్షలు



సీఎం రేవంత్‌రెడ్డితో ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: సీఎం రేవంత్‌రెడ్డిని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ గురువారం హైదరాబాద్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఎంపీ వెంట పీకేరావు ఉన్నారు.

కేసీఆర్‌ను కలిసిన 'శేరి'



మాజీ సీఎం కేసీఆర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి

మెదక్‌మున్సిపాలిటీ: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫాంహౌస్‌లో ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా నియోజకవర్గంలో కార్యకర్తల బాగోగుల గురించి కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రాధాకిషన్

చేగుంట(తూప్రాన్): పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన చేగుంటలో తపస్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల మీదే ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నీరజ, తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లం, చల్లా లక్ష్మణ్, మండల నాయకులు వెంకటేశ్, కృష్ణమూర్తి, రేఖ, ప్రభాకర్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలకు కేంద్రం పెద్దపీట



ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): రైతుల ప్రయోజనాల కోసమే ప్రధాని నరేంద్ర మోదీ కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులను పెంచారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోగుల రాజు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులను ఏడాదికి రూ. 6 వేల నుంచి రూ. 10 వేలకు పెంచారని, అలాగే ఎరువుల ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ పెంచిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాగి రాములు, వనం నర్సింహులు, ఆశోక్, మంజుల, సతీష్, రాజుయాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐపై జాతీయ సదస్సు

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ఈ నెల 3 నుంచి రెండ్రోజుల పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై జాతీయస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత చెప్పారు. గురువారం ఆమె మాట్లాడుతూ కళాశాల మైక్రోబయాలజీ, కంప్యూటర్‌సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తారని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై నిర్వహించే ఈ సదస్సు మొట్టమొదటిదన్నారు. సెమినార్‌కు అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ మదన్‌మోహన్‌లు వ్యవహరిస్తారన్నారు. సదస్సులో ప్రవేశపెట్టే ఉత్తమ పరిశోధనాపత్రాలకు పురస్కారాలను అందించనున్నట్లు ఆమె వివరించారు.

సమస్యలు నా దృష్టికి తీసుకురండి

మంత్రి పొన్నం ప్రభాకర్



కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ(హుస్నాబాద్): గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం కోహెడలో కాంగ్రెస్ కార్యకర్తలతో భేటీ అయ్యారు. గ్రామాల సమస్యలపై ఆరా తీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామగ్రామాన తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతోందని.. ఇళ్లు లేని పేదలకు ఇళ్లు కేటాయిస్తామన్నారు. త్వరలోనే రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. సింగరాయ జాతర రోడ్డు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కోహెడకు కృషి విజ్ఞాన కేంద్రం మంజూరు చేశామన్నారు. ఇప్పటికే 55వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. సంక్రాంతికి రైతు భరోసా ఇస్తామన్నారు. కోహెడ, హుస్నాబాద్, సైదాపూర్ మార్కెట్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు వస్తామని మంత్రి కార్యకర్తలకు చెప్పారు. 30వేల కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మంద ధర్మయ్య, బొయిని నిర్మల, దొమ్మాట జగన్‌రెడ్డి, గాదాసు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సగం మందికే సబ్సిడీ

అర్హులకు అందని రూ. 500 సిలిండర్ స్కీం

- జిల్లావ్యాప్తంగా 2,34,952 గ్యాస్ కనెక్షన్లు
- వర్తిస్తున్నది 1,25,491 మందికే..



ఈ ఫొటోలోని గృహిణి పేరు దేవొళ్ల భాగ్య. నిజాంపేట గ్రామం. ఈమెకు తెల్లరేషన్ కార్డు ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి, ఇందిరమ్మ.. ఇలా తదితర పథకాలకు దరఖాస్తు చేసుకుంది. అయితే ఇప్పటివరకు పలుమార్లు గ్యాస్ బుక్ చేసుకున్నా.. సబ్సిడీ డబ్బులు అకౌంట్‌లో పడలేదు. ఇది ఈమె ఒక్కరి పరిస్థితే కాదు... జిల్లా వ్యాప్తంగా 75 వేల పైచిలుకు అర్హులకు గ్యాస్ రాయితీ అందడం లేదు.

మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా 17 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా.. 2,34,952 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 33,618 కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద ప్రతి నెల ఒక్కో గ్యాస్ బండకు రూ. 372 సబ్సిడీ ఇస్తోంది. ఇకపోతే 2,01,334 గ్యాస్ కనెక్షన్లు రాష్ట్ర పరిధిలోనివి. వాటిలో దీపం పథకానికి సంబంధించినవి 63,161 కాగా, సీఎస్ఆర్ కింద 29,485, డొమెస్టిక్ పరిధిలో 1,08,688 ఉన్నాయి. కాగా వీటిలో 1,25,491 గ్యాస్ కనెక్షన్లకు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా సబ్సిడీ అందుతోంది. ఈ లెక్కన ఇంకా 75,843 మంది అర్హులకు సబ్సిడీ డబ్బులు రావాల్సి ఉంది.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి రూ. 500లకే గ్యాస్ అందజేస్తామని ప్రకటించింది. అయితే క్షేత్రస్థాయిలో అర్హులకు ఇది అందని ద్రాక్షగా మారింది. సిలిండర్‌పై సబ్సిడీ అందిస్తున్నా.. మెజార్టీ బీపీఎల్ కుటుంబాలకు అందడం లేదు. దీంతో వారు నిత్యం ప్రభుత్వ కార్యాలయాలు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరంభంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానించింది. అయితే దరఖాస్తులో గ్యాస్ నంబర్ కాలమ్ ఇచ్చింది. అందులో ఆరు అంకెలు గల నంబర్ మాత్రమే అర్హులు నింపారు. కానీ 12 అంకెలు గల నంబర్‌ను నింపాల్సి ఉందని, దానిని గ్యాస్ ఏజెన్సీ వారు ఆన్‌లైన్ ద్వారా సేకరించి ఇస్తారని, అనంతరం ఆ నంబర్‌ను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేస్తే అప్పుడు సదరు లబ్ధిదారుడికి సబ్సిడీ అందుతుందని సంబంధిత ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అయితే ఈ విషయంపై అధికారులు ఇప్పటివరకు ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో జిల్లాలో వేలాది మందికి ఈ పథకం అందకుండా పోయింది. అలాగే మరికొంత మందికి తెల్లరేషన్ కార్డు లేకపోవడంతో మహాలక్ష్మి పథకానికి దూరంగా ఉన్నారు.



మాటలేగానీ చేతలేవి..?

- గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి
- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ హేమలత ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఏ మాత్రం మార్పు కానరావడం లేదని మెదక్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ హేమలత విమర్శించారు. పాలకుల వైఫల్యం కారణంగా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. గురువారం మనోహరాబాద్‌లో విలేకరులతో ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో గ్రామాలు పురోగతి సాధించాయని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారన్నారు. అప్పట్లో ప్రతి గ్రామం నందనవనంగా మార్చామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో గ్రామాలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుందని, పంచాయతీ కార్యదర్శులు సర్వేలంటూ తిరుగుతున్నారని, ఎక్కడి పనులు అక్కడే నిలిచ్చిపోయాయని మండిపడ్డారు. ఇప్పటికి గ్రామ పంచాయతీలకు నిధులు రాలేదని, గత ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో ఈ ఏడాది పూర్తయ్యిందని ఆమె తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పాలనను నిశితంగా గమనిస్తున్నారని, మాటలు తప్ప, చేతలు లేవని ఇప్పుడిప్పుడే అర్థం అవుతుందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శేఖర్‌గౌడ్, మండల పార్టీ నాయకులు దాసరి నరేష్, రతన్‌లాల్, భిక్షపతి, స్వామిగౌడ్, శ్రీనివాస్, శైలేందర్, ప్రభాకర్‌యాదవ్, ఇర్ఫాన్ తదితరులు ఉన్నారు. కాగా, సీఎంరిలీఫ్ ఫండ్ నుంచి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 11 మందికి కలిపి రూ.2.80 లక్షల విలువైన చెక్కులను అందజేశారు.

ఎక్కడికక్కడ పోలీసుల కట్టడి

కస్టోడియన్ భూముల వద్దకు వెళ్లకుండా అడ్డగింత



అదుపులోకి తీసుకున్న వారిని నర్సాపూర్ పట్టణంలో విడిచిపెడుతున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్)/నర్సాపూర్ రూరల్: కస్టోడియన్ భూములు చదును చేసుకునేందుకు వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లి పంచాయతీ మధిర గ్రామమైన లక్ష్మాపూర్ శివారులో సుమారు 1,000 ఎకరాల పైచిలుకు కస్టోడియన్ భూములను సీపీఐ ఆధ్వర్యంలో వారం రోజులుగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు చదును చేస్తున్నారు. అందులోని పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించి హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కస్టోడియన్ భూముల్లోకి వెళ్తుండడంతో గురువారం పోలీసులు పలుచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల నుంచి లక్ష్మాపూర్ వైపునకు వెళ్తున్న వారిని శివ్వంపేట మండలం చాకరిమెట్ల అటవీ ప్రాంతంలో అడ్డుకున్నారు. కొందరు వినకపోడంతో అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. భూములను చదును చేసేందుకు ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల చెందిన పలువురు గొడ్డళ్లు, కొడవళ్లతో రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇదిలా ఉండగా భూములను చదును చేసిన రైతులను గుమ్మడిదల పోలీసులు గురువారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. సాయంత్రం వరకు అక్కడే ఉంచుకొని చీకటి పడిన తర్వాత డీసీఎంలో నర్సాపూర్ పట్టణంలో వదిలివెళ్లారు. దీంతో రైతులకు పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. చేతిలో చిల్లి గవ్వ లేదని బస్సుల్లో, ఆటల్లో తిరుగుకుంటూ గుమ్మడిదల మండలంలోని తమ గ్రామాలకు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు.

ముగ్గులు వేసి.. నిరసన తెలిపి



ముగ్గులు వేసి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 24వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా ప్రధాన గేటు ఎదుట మహిళా ఉద్యోగులు ముగ్గులు వేసి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎన్నో ఆశలతో గెలిపించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి మా జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి పాషా, రాజశేఖర్, సంపత్, శంకర్, కవిత, మంజుల, ధరణి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నర్సాపూర్ రూరల్: మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫరానా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతి పూర్తి చేసి 6వ తరగతిలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులతో పాటు 7వ తరగతి నుంచి 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం సైతం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈనెల 6వ తేదీ నుంచి ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం



అదనపు కలెక్టర్ నగేష్‌కు మొక్కను అందజేస్తున్న సంఘం నాయకులు

మెదక్‌జోన్: పంచాయతీ కార్యదర్శుల సంఘం (టీఎన్‌జీఓస్) జిల్లా, కార్యదర్శులు గురువారం అదనపు కలెక్టర్ నగేష్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు జంగం నగేష్ కుమార్, నర్సింహులు, శ్రీధర్ బొజ్జ, సంతోష్, కె.సంతోష్ ఉన్నారు. అనంతరం డీపీఓ యాదయ్య, జెడ్పీ సీఈఓ ఎల్లయ్యను సైతనం కలిసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

గుజరాత్ ఐఐటీ కార్యశాలకు రవివర్మ



ఐఐటీ కార్యశాలలో పాల్గొన్న రవివర్మ

కోహెడరూరల్(హుస్నాబాద్): గుజరాత్ రాష్ట్రం ఐఐటీ గాంధీనగర్‌లో జరిగిన సీసీఎల్ సృజనాత్మక బోధన ప్రయోగ కార్యశాలకు కోహెడ మండలం వింజపల్లి పరిధిలోని పెరుకలగడ్డ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రవివర్మ పాల్గొన్నారు. 5రోజుల పాటు జరిగే శిక్షణలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రయోగ పూర్వకంగా అభ్యాసనం, పరిసరాలలో నిరుపయోగ వస్తువుల ద్వారా సైన్స్, గణిత అంశాలను తయారుచేయడంలో మెలకువలు తెలుసుకున్నారు. వివిధ రాష్ట్రల నుంచి వచ్చిన విద్యావేత్తలతో సమష్టిగా పాల్గొన్నారు. పిల్లల్లో ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీసేలా ఉండి ప్రతి వస్తువుతో ఒక శాస్త్రీయంగా ఆలోచన కలుగుతుందని అని ఆయన ఫోన్‌లో 'సాక్షి'కి తెలిపారు.

బైపాస్ రోడ్డుతో ట్రాఫిక్‌కు చెక్

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



బైపాస్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణ అభివృద్ధితో పాటు ట్రాఫిక్ సమస్యల నివారణ, చుట్టు పక్కల మండలాల్లోని జనాలకు మేలు చేకూర్చేందుకు బైపాస్ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ శివారులోని చాంద్‌ఖాన్‌పల్లి నుంచి కంగ్టి రోడ్డుకు నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో జనాభా రోజు రోజుకు పెరుగుతున్నందున రానున్న రోజుల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పిస్తున్నామని వివరించారు. ఇప్పటికే కరస్‌గుత్తి రోడ్డు నుంచి కంగ్టి రోడ్డుకు బైపాస్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. చాంద్‌ఖాన్‌పల్లి నుంచి ఖాంజీపూర్ వరకు.. అక్కడి నుంచి జాతీయ రహదారి వరకు లింక్‌రోడ్లను నిర్మిస్తామని చెప్పారు. ప్రజలు అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. అలాగే పట్టణంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు.

ఉపాధిలో అక్రమాలకు చెక్

అందుబాటులోకి జన్‌మన్‌రేగా యాప్



మెదక్ కలెక్టరేట్: ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత పెంచి అక్రమాలకు తావివ్వకుండా ప్రభుత్వాలు అనేక సంస్కరణలు తెస్తున్నాయి. పనుల నిర్వహణ, అమలు, డబ్బు చెల్లింపు విషయంలో కాలక్రమేణా అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. కూలీల వేతనాలు దుర్వినియోగం కాకుండా లబ్ధిదారుడికి బ్యాంకు, పోస్టాఫీస్ ఖాతాలు తెరిచి నేరుగా చెల్లింపులు చేస్తున్నారు. అయితే ఒకరికే రెండు, మూడు ఖాతాలు ఉండటంతో ఎందులో జమ చేశారో తెలుసుకోవడం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా 'జన్‌మన్‌రేగా' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా కూలీలు ఎన్ని రోజులు పని చేశారు. ఎంత కూలీ వచ్చింది..? ఎక్కడ పనులు జరిగాయి. ఎన్ని డబ్బులు చెల్లించారు. ఇంకెంత చెల్లించాలి.. వంటి పూర్తి సమాచారం తెలుసుకోవచ్చు.

అరచేతిలో సమగ్ర సమాచారం

ప్లే స్టోర్ నుంచి జన్‌మన్‌రేగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇందులో కూలీల వేతనాలు, పని దినాలకు సంబంధించిన ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, కుటుంబం ఐడీ వివరాలు నమోదు చేయాలి. పేమెంట్ ఆప్షన్‌లోకి వెళ్లి వ్యక్తి పేరు మీద క్లిక్ చేస్తే ఎక్కడ పని చేశారు. పని దినాల సంఖ్య, ఎంత వేతనం, ఎప్పుడు జమ చేశారు, ఏ బ్యాంకులో వేశారు వివరాలు ఉంటాయి. ఉపాధి హామీ డబ్బులు జమ కాకుంటే సదరు లబ్ధిదారుడి ఖాతాకు సంబంధించి ఆధార్ లింకు అయిందా, ఆధార్‌లో పోలిన విధంగా బ్యాంకు వివరాలు ఉన్నాయా..? ఆధార్ బ్రిడ్జ్ పేమెంట్ సిస్టం (ఏబీపీఎస్) లింక్ అయిందో లేదో వివరాలు సరి చూసుకోవచ్చు. ఒకవేళ అన్నీ లింకై తే పచ్చరంగులో రైట్ గుర్తు ఉంటుంది. లేదంటే ఎక్కడ సమస్య ఉందో అక్కడ ఎరుపు రంగు గుర్తు చూపుతుంది. జాబ్‌కార్డులో కుటుంబ సభ్యుల వివరాలు ఉంటాయి. అందుకు అటెండెన్స్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. ఏ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పని చేశారు. ఎవరెవరు ఎన్ని రోజులు పనిచేశారో వివరాలు కనిపిస్తాయి.

జిల్లాలో 1.64 లక్షల జాబ్‌కార్డులు

జిల్లాలో మొత్తం 21 మండలాలు, 493 గ్రామ పంచాయతీలు ఉండగా.. మొత్తం 1.64 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. ఈ ఏడాది జిల్లాలో 45 లక్షల పనిదినాల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించగా, ఇప్పటి వరకు 40,37,714 పనిదినాలు కల్పించారు. దీంతో 2,227 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. పూర్తయిన కూలీ పనులకు సంబంధించి రూ. 88.13 కోట్లు చెల్లించారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

ఉపాధి కూలీల వేతనాల చెల్లింపుల్లో అక్రమాలకు తావు లేకుండా కేంద్ర ప్రభుత్వం తాజాగా జన్‌మన్‌రేగా యాప్ తీసుకొచ్చింది. ప్రతి శుక్రవారం రోజ్‌గార్ దీవాస్ కార్యక్రమం ఉంటుంది. ఈసందర్భంగా ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా కూలీలకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. కూలీలు తమ వివరాలు అందులో సమగ్రంగా తెలుసుకోవచ్చు.

– శ్రీనివాస్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

క్లుప్తంగా

రిమాండ్‌కు వైన్స్ దొంగ


నిందితుడు రాజాసోద్

చిన్నశంకరం పేట(మెదక్‌): నార్సింగి మండల కేంద్రంలోని కనదుర్గా వైన్స్‌లో చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ అహ్మద్‌ మోహినోద్దీన్‌ కథనం మేరకు.. నేపాల్‌కు చెందిన రాజాసోద్‌ తొమ్మిది నెలల కిందట నార్సింగిలోని ఓ రైస్‌ మిల్లులో హమాలీగా పని చేసేందుకు వచ్చాడు. కూలీ డబ్బులతో నిత్యం మద్యం సేవిస్తుండేవాడు. తాను తాగే వైన్స్‌లోనే చోరీ చేయాలనే ఆలోచనతో పరిసరాలను పరిశీలించి చోరీకి యత్నించాడు. వైన్స్‌లో దొంగతనానికి వచ్చి అక్కడే తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లి దొరికిపోయాడు. నిందితుడిని రామాయంపేట ప్రభుత్వాస్పత్రిలో వైద్య చికిత్స అందించగా బుధవారం సాధారణ స్థితికి వచ్చాడు. వైద్య పరీక్షల అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యథేచ్ఛగా కుంట కాల్వ కబ్జా


కబ్జాకు గురైన కుంట కట్టు కాల్వ

తూప్రాన్‌: కుంట కాల్వను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నా ఇరిగేషన్‌ అధికారులు పట్టించుకోవడం లేదని సమీప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కిష్టాపూర్‌–వెంకటాయిపల్లి గ్రామాల మధ్య వెంకటాయిపల్లి చెరువు వర్షంతో నిండిన అనంతరం మత్తడి నుంచి కిష్టాపూర్‌ గ్రామ సమీపంలోని తుర్కకుంటకు కాల్వ ద్వారా వచ్చి చేరుతుంది. కానీ కొందరు అక్రమార్కులు కుంట కాల్వను కబ్జా చేశారు. ఫలితంగా రానున్న రోజుల్లో వర్షపు నీరు ఏ విధంగా కుంటలోకి వచ్చి చేరుతుందని సమీప రైతులు ప్రశ్నిస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్‌ అధికారులు స్పందించి కుంట కాల్వ కబ్జాకు గురికాకుండా కాపాడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో ఇరిగేషన్‌ ఏఈ అనురాధకు ఫోన్‌లో సంప్రదిస్తే స్పందించలేదు.

పంచాయితీ పెడితే పరువు పోతుందని..


ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం


సుంకిల్‌(ఫైల్‌)

హవేళీఘణాపూర్‌(మెదక్‌) : ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని లింగ్సాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బండారి సుంకిల్‌(48) డిసెంబర్‌ 31న రాత్రి అదే గ్రామంలో పెట్రోల్‌ దొంగతనం చేస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. గురువారం పంచాయితీ పెడుతామని చెప్పారు. గ్రామంలో పంచాయితీ పెడితే తన పరువు పోతుందని మనస్తాపంతో ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలాన్ని హవేళీఘణాపూర్‌ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య అంజమ్మ, కుమారుడు ఉన్నాడు.

పింఛన్‌ కోసం వెళ్లి..

వృద్ధుడు అదృశ్యం


సత్తయ్య

తూప్రాన్‌: వృద్ధుడు అదృశ్యమైన ఘటన పట్టణ పరిధిలోని హైదరగూడలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం గురువారం తెలిపిన వివరాల ప్రకారం .. హైదరగూడకు చెందిన కేశబోయిన సత్తయ్య డిసెంబర్‌ 31న పింఛన్‌ కోసం పట్టణంలోని పోస్టు ఆఫీసుకు ఆటోలో వెళ్లాడు. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికిన ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

చదువులు సాఫీగా..

కేజీబీవీలపై కనిపించని సమ్మె ప్రభావం
- ప్రత్యక్ష, ఆన్‌లైన్‌లో యథావిధిగా బోధన
- టెన్త్‌, ఇంటర్‌ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- కొన్నిచోట్ల ఉపాధ్యాయుల సర్దుబాటు


చేర్యాల కేజీబీవీలో ఆన్‌లైన్‌లో పాఠాలు వింటున్న విద్యార్థినిలు


కొండపాక కేజీబీవీలో ఇంగ్లిష్‌ బోధిస్తున్న సెక్టోరియల్‌ అధికారి రంగనాథ్‌

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు సిబ్బంది, తమ ఉద్యోగాలను రెగ్యులర్‌ చేయాలని కొద్దిరోజులుగా సమ్మె చేస్తున్నారు. వీరి సమ్మె విద్యార్థుల బోధనపై ప్రభావం చూపకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కసరత్తు చేశారు.

జిల్లాలోని 23 కేజీబీవీల్లో 5,110 మంది విద్యార్థునీలు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 823 మంది పదవ తరగతి, 757 మంది ఇంటర్‌ విద్యార్థినీలు ఉన్నారు. వీరికి గాను 244 మంది బోధన సిబ్బంది ఉన్నారు. రెగ్యులరైజేషన్‌, వేతనాల పెంపు విషయంలో ఇందులోని 209 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో కొద్ది రోజులుగా కేజీబీవీల్లో బోధనకు ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో విద్యార్థినులు సైతం మా చదువులు ఎలా అని ఆందోళన చేపట్టారు. దీనిపై స్పందించిన విద్యాశాఖ విద్యార్థినీల చదువులకు ఆటంకం కలుగకుండా చర్యలు చేపట్టింది. కేజీబీవీల పక్కనే ఉన్న ఆదర్శ పాఠశాలలు, లోకల్‌ బాడీస్‌, జిల్లా పరిషత్‌ పాఠశాలలోని ఉపాధ్యాయులతో ఈ బోధన చేయిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంతోపాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తరగతులు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. కేజీబీవీల్లో విధులు నిర్వహించే సీఆర్‌టీ, పీజీసీఆర్‌టీలతోపాటు అందులో విధులు నిర్వహించే 36 మంది అకౌంటెంట్‌, ఇతర నాన్‌ టీచింగ్‌ స్టాఫ్‌ ఈ సమ్మెలో పాల్గొంటున్నారు.

మొదట ఆందోళన.. ఆపై ఆనందం

సమ్మె మొదట్లో కేజీబీవీల విద్యార్థినీల తల్లిదండ్రులు తమ పిల్లలకు బోధన ఎలా అని ఆందోళన చెందారు. ముఖ్యంగా పది, ఇంటర్‌ విద్యార్థినీల తల్లిదండ్రుల్లో ఈ ఆందోళన ఎక్కువగా ఉండేది. వెంటనే విద్యాశాఖ స్పందించి తీసుకున్న చొరవతో తరగతులు సక్రమంగా జరుగుతున్నాయి. దీంతో విద్యార్థినీల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇంటర్‌ విద్యార్థినీలకు అయితే ప్రత్యక్ష బోధనతోపాటు ఆన్‌లైన్‌ బోధన అందడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. పది, ఇంటర్‌ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక కసరత్తు చేస్తుంది. విద్యార్థుల బోధనపై సమ్మె ప్రభావం లేకుండా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది.

నాణ్యమైన బోధన అందిస్తున్నాం

కేజీబీవీల్లో విద్యార్థినీలను నాణ్యమైన ఆహారంతోపాటు విద్యను అందిస్తున్నాం. సమ్మె ప్రభావం విద్యార్థినీలపై పడకుండా చూస్తున్నాం. అలాగే విద్యార్థినీలు పరీక్షల్లో రాణించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ముఖ్యంగా ఇంటర్‌ విద్యార్థినీలకు మోడల్‌ స్కూల్‌, జూనియర్‌ కళాశాలకు చెందిన అధ్యాపకులు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. విద్యార్థినీలకు పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయి. దీంతోపాటు ఆన్‌లైన్‌లో కూడా తరగతులను నిర్వహిస్తున్నాం.

–ముక్తేశ్వరి, జీఈసీవో, సిద్దిపేట

కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో బోల్తా


బోల్తా పడిన ట్రాలీ ఆటో


ఘటనా స్థలంలో క్షతగాత్రులు

ఐదుగురికి తీవ్ర, మరో పది మందికి స్వల్పగాయాలు

శివ్వంపేట(నర్సాపూర్‌) : టాటా ఏస్‌ ట్రాలీ బోల్తా పడి మహిళా కూలీలకు గాయాలైన ఘటన గురువారం చిన్నగొట్టిముక్ల– గోమారం ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన 20 మంది మహిళలు గుమ్మడిదల మండలం లక్ష్మాపూర్‌ వద్ద కస్టోడియం భూములు చదును చేసుకునేందుకు టాటా ఏస్‌ ట్రాలీ ఆటోలో వెళ్తున్నారు. ఆటోలో అధిక సంఖ్యలో ఎక్కడంతో మార్గమధ్యలో టిక్యదేవమ్మగూడం గ్రామ పంచాయతీ పరిధిలో ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మధిర పెంటమ్మ, కమల, గుమ్మడి పెంటమ్మ, పానుగాటి మాణెమ్మ, షేక్‌ షమీన్‌కు తీవ్ర గాయాలు కాగా సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే, మధిర నాగమణి, కర్రె రాములమ్మ, కర్రె హంసమ్మ, షేక్‌ హసీనా, జలీనా, రిజ్వానా, నువ్వుల అనితతోపాటు మరికొందరికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని నర్సాపూర్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మరికొంత మంది శివ్వంపేటలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా క్షతగాత్రులను నర్సాపూర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి గురువారం రాత్రి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు నవీన్‌ గుప్తా, గణేష్‌ తదితరులు ఉన్నారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

గజ్వేల్‌రూరల్‌: లారీని వెనుక నుంచి ఆర్టీసీ ఎలక్ట్రిక్‌ బస్సు ఢీకొట్టడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌ రింగురోడ్డు వద్ద బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసులు, జీపీపీ ఆర్టీసీ డిపో అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌ ఆర్టీసీ డిపోకు చెందిన ఎలక్ట్రిక్‌ ఎక్స్‌ప్రెస్‌ బస్సు 20 మంది ప్రయాణికులతో జేబీఎస్‌ నుంచి కరీంనగర్‌ వైపు వెళ్తుంది. ఈ క్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌ రింగురోడ్డు దిగిన తర్వాత రిమ్మనగూడ సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందుభాగం దెబ్బతినగా డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బస్సులోని ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బస్సు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సైదా తెలిపారు.


ముఖ్యమంత్రితో సమావేశమైన లగచర్ల, హకీంపేట్‌ గ్రామాల నాయకులు

లగచర్ల కేసులు ఎత్తివేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన లగచర్ల, హకీంపేట్‌ నాయకులు
- రైతు కుటుంబాల బాధ చూడలేకే మీ వద్దకు వచ్చాం
- భూ పరిహారం పెంచాలని విన్నపం
- ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు నేతల వెల్లడి

దుద్యాల్‌: లగచర్ల ఘటనలో రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కాంగ్రెస్‌ పార్టీ లగచర్ల, హకీంపేట్‌ గ్రామాల నాయకులు సీఎం రేవంత్‌ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సమావేశమై ఈ మేరకు విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత ఏడాది నవంబర్‌ 11న లగచర్ల ఘటనలో రైతులపై ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అనుకోకుండ జరిగిన ఘటనలో చాలా మంది అమాయక రైతులు కేసుల్లో ఇరుక్కున్నారని, వారి కుటుంబాల బాధను చూడలేక మీ వద్దకు వచ్చినట్లు తెలిపారు. కేసులు ఎత్తివేయాలని కోరారు. అలాగే పారిశ్రామిక వాడ కోసం భూములు ఇచ్చే రైతులకు పరిహారం పెంచాలని కోరారు. దీనిపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. కొంతమంది ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని.. అలాంటి వారితో మాట్లాడి అపోహలు తొలగించాలని సీఎం సూచించినట్లు చెప్పారు. రైతులతో మాట్లాడి అభివృద్ధికి సహకరించేలా చూడాలని అన్నట్లు తెలిపారు. కొత్తగా ఏర్పడిన దుద్యాల్‌ మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో లగచర్ల మాజీ సర్పంచ్‌ అనంతయ్య, కాంగ్రెస్‌ పార్టీ దుద్యాల్‌ మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, హకీంపేట్‌ మాజీ సర్పంచ్‌ సంజీవరెడ్డి, లగచర్ల ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవి కుమార్‌, నాయకుడు యుగంధర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంజీరాలో నీట మునిగి రైతు మృతి

పాపన్నపేట(మెదక్‌): ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని పొడిచన్‌పల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బుట్ట జీవయ్య (63) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంజీరా నది ఒడ్డున ఉన్న తన పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో మోటార్‌ పని చేయకపోవడంతో నదిలోకి దిగిన జీవయ్య ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. సమీపంలో ఉన్న వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గ్రామస్తులతో కలిసి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య కిష్టమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..

సంగారెడ్డి క్రైమ్‌ : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి వ్యక్తి మృతి చెందాడు. సంగారెడ్డి పట్టణ సీఐ రమేశ్‌ కథనం మేరకు.. ఏపీలోని కాకినాడ జిల్లాకు చెందిన పీర్లు (45) పని నిమిత్తం మూడు నెలల కిందట మహమ్మదుపూర్‌ తండాకు వచ్చి ఇటుక బట్టీలో కూలీగా చేరాడు. డిసెంబర్‌ 31న మధ్యాహ్నం మహబూబ్‌ సాగర్‌ చెరువు కట్టలో చేపల పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగిపోయాడు. గురువారం ఉదయం మృతదేహం తేలడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో వ్యక్తి..


చంద్రం (ఫైల్‌)

చేగుంట(తూప్రాన్‌): మద్యం మత్తులో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన చేగుంటలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన ఉప్పరి చంద్రం(49) కొన్నేళ్లుగా మద్యానికి బానిసై పనులు మానేశాడు. బుధవారం ఉదయం ఇంట్లోంచి వెళ్లిన సత్యం రాత్రి అన్నపూర్ణ హోటల్‌ సమీపంలో పడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. అదే రాత్రి తూప్రాన్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే చంద్రం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుండెపోటుతో జూనియర్‌ అసిస్టెంట్‌..


అరవింద్‌ కుమార్‌(ఫైల్‌)

కల్హేర్‌(నారాయణఖేడ్‌): గుండెపోటుతో రెవెన్యూ శాఖలో పని చేస్తున్న జూనియర్‌ అసిస్టెంట్‌ మృతి చెందాడు. తహసీల్దార్‌ శివశ్రీనివాస్‌ కథనం మేరకు.. కల్హేర్‌ తహసీల్దార్‌ కార్యాలయ జూనియర్‌ అసిస్టెంట్‌ అరవింద్‌కుమార్‌(29) హత్నూర మండలంలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి సంగారెడ్డిలోని ఇంట్లో ఉండగా అరవింద్‌ కుమార్‌కు గుండెపోటు రావడంతో మృతి చెందాడు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం తరఫున మృతుడి కుటుంబీకులకు రూ.15 వేలు నగదు సాయం అందజేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

సిద్దిపేటరూరల్‌: బైక్‌ అదుపుతప్పి కిందపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై అపూర్వ రెడ్డి కథనం మేరకు.. ముస్తాబాద్‌ మండలం మోహిని కుంట గ్రామానికి చెందిన తుమ్మల శ్రీను బుధవారం సిద్దిపేట రూరల్‌ మండలం రాఘవాపూర్‌ గ్రామంలోని బంధువుల ఇంటికొచ్చాడు. అక్కడ మామిడి తోటలో పనులు ముగించుకొని తిరిగి సాయంత్రం ఇంటికి బయలుదేరాడు. నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి వద్దకు రాగానే శ్రీను బైక్‌ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యాన సాగు వైపు దృష్టి సారించాలి

ములుగు ఉద్యాన వర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌ డాక్టర్‌.రాజిరెడ్డి


రైతుల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న వీసీ రాజిరెడ్డి

ములుగు(గజ్వేల్‌): రైతులు మొక్కజొన్న, పత్తి, వరి పంటలకే పరిమితం కాకుండా ఉద్యాన పంటల సాగు వైపు దృష్టి సారించాలని ములుగులోని కొండా లక్ష్మణ్‌ తెలంగాణ ఉద్యానవర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ డాక్టర్‌. దండ రాజిరెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో గురువారం నిర్వహిస్తున్న ఉద్యాన ఉత్సవ్‌ కార్యక్రమానికి ఉద్యాన విశ్వవిద్యాలయం కింద పని చేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం పెద్దపల్లి జిల్లా నుంచి తరలివెళ్తున్న రైతుల వాహనాన్ని పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన కూరగాయలు మన ఊరికే ఆ తర్వాతే బయటి మార్కెట్‌కు తరలించాలనే ధోరణిలో రైతులు ముందుకు సాగాలన్నారు. మన ఊరు–మన కూరగాయలు కార్యక్రమాన్ని పైలెట్‌ ప్రాజెక్ట్‌గా చేపట్టాలని సూచించారు. ఉద్యానవన సాగు రైతులుకు మేలన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు విజయ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ శ్రీనివాస్‌, ఉద్యాన శాస్త్రవేత్త భాస్కర్‌రావు, విస్తరణ విభాగం శాస్త్రవేత్త వినోద్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

మందు బాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన వాహదారులకు కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ సీఐ సుమన్‌ కుమార్‌ తెలిపారు. డిసెంబర్‌ 31న డ్రంకెన్‌ డ్రైవ్‌ తనిఖీల్లో 41 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారన్నారు. వారిని గురువారం జిల్లా న్యాయస్థానంలో హాజరు పర్చగా జిల్లా రెండో శ్రేణి అదనపు న్యాయమూర్తి షకీల్‌ అహ్మద్‌ సిద్ధికి 18 మందికి రూ.2,000, 22 మందికి రూ.1,500, ఒకరికి రూ.1,000 జరిమానా విధించినట్లు తెలిపారు.

పటాన్‌చెరులో 28 మంది

పటాన్‌చెరు టౌన్‌ : డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూ నాయక్‌ కథనం మేరకు.. బుధవారం నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 28 మందిని పట్టుబడ్డారని, వీరిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఇద్దరికి రూ.1,000, ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.1,500, మరో 19 మందికి రూ.2,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

రాజ్యాధికారంతోనే హక్కుల సాధన


కేలండర్‌ ఆవిష్కరిస్తున్న రాజ్‌కుమార్‌, సంఘం నేతలు

పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌

శివ్వంపేట(నర్సాపూర్‌): రాజ్యాధికారంతోనే మన హక్కులు సాధించుకునేందుకు అవకాశం ఉంటుందని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్‌ అన్నారు. గురువారం మండల పరిధి దంతన్‌పల్లి గ్రామంలో పద్మశాలీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కేలండర్‌ ఆవిష్కరించడంతో పాటు పలు అంశాలపై చర్చించారు. అనంతరం రాజ్‌కుమార్‌ మాట్లాడుతూ.. పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొంది సత్తా చాటాలన్నారు. హైదరాబాద్‌లో పద్మశాలీ విద్యార్థుల కోసం హాస్టల్‌ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల జయరాములు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వేముల బాల్‌రాజ్‌, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు గజేంద్రుల నర్సింలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పామల వెంకటేశం, శంకర్‌, శ్రీనివాస్‌, రాష్ట్ర కార్యదర్శి వడిచర్ల మారుతీ, కోశాధికారి సర్గం వెంకట్‌ నారాయణ, శివ్వంపేట, వెల్దుర్తి మండల అధ్యక్షులు బొడ్డు భిక్షపతి, గజం వెంకటేశం, జిల్లా నాయకులు వీరేశ్‌, నర్సింలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ భూతం.. తీస్తోంది ప్రాణం

మృత్యువాత పడుతున్న పశువులు
- రోజురోజూ పెరుగుతున్న ప్లాస్టిక్‌ వినియోగం
- జాగ్రత్త పడకుంటే అనర్థాలే


ప్లాస్టిక్‌ కవర్లను తింటున్న పశువులు

హత్నూర(సంగారెడ్డి): ప్లాస్టిక్‌ భూతం మనుషులకే కాదు.. పశువులకు ప్రాణాంతకరంగా మారింది. మనుషులు ఉపయోగించే ప్లాస్టిక్‌ కవర్లను చెత్తలో పారేయడంతో వాటిని పశువులు తిని మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్‌ నివారణ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తూతూ మంత్రంగా వ్యవహరించడంతో పశువుల పాలిట శాపంగా మారింది. ప్లాస్టిక్‌ వినియోగంతో కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన పెరుగుతున్నా అమలులో మాత్రం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. ప్రభుత్వం 20 మైక్రాన్ల ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగులు నిషేధించింది. అధికారుల పర్యవేక్షణ లేక ప్లాస్టిక్‌ క్యారీ బ్యాగులు అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

కవర్లతో సహా ఆహార పదార్థాలు పడేస్తూ..

పాడి పశువులను పాలు పిచ్చికి తర్వాత బయటకు వదిలేస్తారు. వాటికి గడ్డి దొరక్కపోవడంతో అవి దొరికిన చోటల్లా ప్లాస్టిక్‌ కవర్లు తింటున్నాయి. చాలా మంది ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను పాలిథిన్‌ కవర్లలో చుట్టి బయట పడేస్తున్నారు. రోడ్డు వెంటే వేయడంతో పట్టణాల్లో తిరిగే పశువులు దాదాపు తొంభై శాతం మేర ప్లాస్టిక్‌ వ్యర్థాలని తింటున్నాయంటే అతిశయోక్తి లేదు. ఇవి అరగకపోవడంతో కడుపులో పేరుకుపోయి వ్యాధుల బారిన పడి పశువులు చనిపోతున్నాయి.

పాలు తాగినా ప్రమాదమే..



పశువులు, మూగజీవాలు ప్లాస్టిక్‌ కవర్లను తినకుండా చూడాలి. పట్టణ ప్రాంతాల్లో చాలా వరకు పశువులు పడేసిన ఆహార పదార్థాలను తినే సమయంలో ప్లాస్టిక్‌ కవర్లను తింటున్నాయి. కవర్లు పశువుల కడుపులో ఉండలుగా తయారై బయటకు రాకుండా కడుపులో ఉంటాయి. వాటి రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. ప్రమాదకర పరిస్థితుల్లో పశువులు చనిపోతున్నాయి. ప్లాస్టిక్‌ తిన్న పశువుల పాలు తాగినా ప్రమాదమే. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త ఉండాల్సిన అవసరం ఉంది.

– సంధ్యారాణి, మండల పశువైద్యాధికారి